క్లుప్తంగా

సీనియర్ సివిల్ జడ్జిగా సత్యలక్ష్మీప్రసన్న



నందిగామటౌన్(నందిగామ రూరల్): నందిగామ సీనియర్ సివిల్ జడ్జిగా సత్యలక్ష్మీప్రసన్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన జడ్జి లక్ష్మీ రాజ్యం ఉద్యోగోన్నతిపై బదలీ అయ్యారు. జడ్జిగా బాధ్యతలు చేపట్టిన సత్యలక్ష్మీప్రసన్నకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయవాదులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు నంద్రు విద్యాసాగర్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పింగళి లక్ష్మీనరసింహారావు, కన్నెకంటి జీవరత్నం, మట్టా ప్రసాద్, బొందలపాటి రామకృష్ణ, నంద్రు శ్రీరామ్మూర్తి, ఆనందం విజయ్, అద్దంకి మణిబాబు, చెరుకుమల్లి రామారావు, రవి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మాగల్లు-సోమవరం రోడ్డులో కంప చెట్ల తొలగింపు



నందిగామ రూరల్: మండలంలోని మాగల్లు–సోమవరం గ్రామాల మధ్యన రహదారికి రెండు వైపులా దట్టంగా పెరిగిన కంప, పిచ్చి చెట్లను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా సోమవరం ఇన్‌చార్జ్ కార్యదర్శి సాయి మాట్లాడుతూ.. మాగల్లు నుంచి దాములూరు, తొర్రగుడిపాడు, సోమవరం వరకు ఏడు కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్డుకు రెండు వైపులా ఉన్న కంప చెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా దాములూరు, కూడలి గ్రామంలో వేంచేసివున్న సంగమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి వారి తిరు కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు వారణాసి సాంబశివరావు, దూమాటి లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం కళ్యాణ ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కానూరి సురేష్ బాబు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్



నందిగామ రూరల్: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు ప్రకటించారు. పట్టణంలోని మద్యం దుకాణాలకు మంగళవారం ఆయన సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నా, అక్రమంగా మద్యం విక్రయాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందిగామ ఎక్సైజ్ పరిధిలోని చందర్లపాడు, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాలోని మద్యం దుకాణాలను మూసివేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బడ్డీ కొట్టు దగ్ధం

నందిగామ రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బడ్డీ కొట్టు దగ్ధమైన ఘటన నందిగామ మండలంలోని దాములూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అంకమ్మరావు గ్రామంలోనే బడ్డీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం సమయంలో దుకాణం తెరిచాడు. కొద్ది సేపటి తరువాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దుకాణంలోని నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులకు మంటలు అంటుకున్నాయి. దుకాణంలోని సరుకు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. చుట్టుపక్కల వారు స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు.

నేడు ముక్తేశ్వరుని కల్యాణ వేడుక

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. బుధవారం శివరాత్రి కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామికి ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నది వద్ద స్నానాలు ఆచరించేందుకు ఘాట్‌లు, నది ఒడ్డున జల్లు స్నానాలాకు ప్రత్యేక పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. అవతలి ఒడ్డుకు భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లకుండా నది వద్ద గజీతగాళ్లు, పడవలను సిద్ధం చేశారు. ఆలయం వద్ద భక్తులు ఇబ్బందులు పడకుండా స్వామి దర్శనానికి ధ్వజస్తంభం నుంచే ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ వేడుకను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

300 మందితో బందోబస్తు

మహా శివరాత్రికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో 300 మంది పోలీసులతో బందోస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏడుగురు ఎస్ఐలు, 100 మంది మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు 200 మందితో బందోబస్తు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నుంచి వచ్చే వాహనాలను ఆలయ సమీపంలోని ఫారం వద్దనే నిలుపుదల చేసేలా చర్యలు తీసుకున్నామని, డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని వివరించారు. మంగళవారం ఆలయ పరిసర ప్రాంతాలను ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి పరిశీలించి చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు.



విద్యుత్ దీపాలంకరణలో భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయం



నది ఒడ్డున ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన పడవలు



నది ఒడ్డున ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు

కోటిలింగాల ముస్తాబు

గ్రామ సమీపంలోని పంచముఖ అమృతలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. ఏడేళ్లుగా స్వామి కల్యాణం ఆలయ ప్రాంగణంలో జరుగుతోంది. ఈ ఏడాది ఆరుబయటే ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ ముందు భాగంలోని 19 అడుగుల ధ్యాన శివుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఏర్పాట్లను ఉత్సవ ప్రత్యేకాధికారి వరప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.

కృష్ణానదికి నీటి విడుదల

పులిచింతల నుంచి కృష్ణా నదిలోకి మంగళవారం రాత్రి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నదిలో నీరు తక్కువగా ఉండటంతో భక్తుల పుణ్య స్నానాల కోసం రెండు వేల క్యూసెక్కులు విడుదల చేశారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ కష్టాలు



ఆలయం వైపు వెళ్లే దారిలో ట్రాఫిక్

- తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- ఉత్సవాల సమయంలో మరింతగా భక్తుల రద్దీ
- అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామంలోని ఇరుకు రోడ్లతో గ్రామస్తులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు నిత్యం తరలివస్తుంటారు. శుక్రవారం, ఆదివారం, ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. వేలాది వాహనాలు తరలి రావటంతో పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం కిటకిటలాడుతుంది. ఆంధ్రా నుండే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వస్తున్నారు. వాహనాల రద్దీతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. తిరునాళ్ల సమయంలో ఇరుకు రోడ్లతో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఇరుకు రోడ్లే కారణం

నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో రోడ్లు ఇరుకు కావటంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా భక్తులు కాజ్‌వే పై నుంచి మునేరు అవతల మామిడి తోటల్లోకి వెళ్లి వంటలు చేసుకొని భోజనాలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ రోడ్డు మొత్తం కుంచించుకు పోయింది. రోడ్డుకు రెండు వైపులా వ్యాపారాలు చేసుకునేవారు రోడ్డు మీదకు దుకాణాలు పొడిగించటంతో వాహనాలు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా కాజ్‌వే వైపు వెళ్లే దారిలో మూల మలుపులో డ్రెయినేజీని దాటి దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మ ఆలయానికి వెళ్లే రహదారి కూడా బాగా ఇరుకుగా ఉండటంతో బస్సు వస్తే ఎదురుగా బైక్ కూడా వెళ్లే పరిస్థితి లేదు. శుక్ర, ఆదివారాల్లో ఆలయానికి వందల సంఖ్యలో కార్లు, బైక్‌లు ఇతర వాహనాలు వస్తున్నాయి. ఆలయయం వద్ద కూడా వాహనాలు పార్కింగ్ స్థలం సరిపోవటం లేదు. వీటన్నిటిని దృష్టిలోఉంచుకొని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చేపట్టాల్సిన చర్యలు ఇవీ..

- రహదారి అభివృద్ధి చేయటంతో పాటు తక్షణం భక్తుల రద్దీ రోజుల్లో వన్‌వే ఏర్పాటు చేయాలి.
- వాహనాలు గ్రామంలో రాకుండా గతంలో ప్రతిపాదించిన విధంగా సుబ్బాయిగూడెం రోడ్డులోని మైత్రీ రోడ్డును అభివృద్ధి చేయాలి.
- మునేకు కాజ్‌వే పక్క నుంచి కరకట్ట ఏర్పాటు చేసి దాని మీద రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
- రహదారుల పక్కన ఆక్రమణలు తొలగించాలి.

శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

వత్సవాయి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. లింగాల మునేటి ఒడ్డున ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయం, ఇందుగపల్లిలోని శ్రీ పార్వతీ సమేత బాలకోటేశ్వరస్వామి ఆలయం, భీమవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన కొంగర మల్లయ్య గట్టుపై వేంచేసియున్న కోనగిరి మల్లికార్జున స్వామి ఆలయం, భీమవరం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మక్కపేట రామలింగేశ్వర స్వామి దేవస్థానం, మంగొల్లు, కన్నెవీడు, పోలంపల్లి, కంభంపాడు, వత్సవాయిలోని శివాలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ పాలక వర్గాలు, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయాల మేనేజర్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. మక్కపేట, లింగాల, భీమవరం, వత్సవాయి గ్రామాల్లో భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. రాత్రి వైభవంగా శివకల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. శివరాత్రిని పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ పి. ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.



శివరాత్రికి సిద్ధమైన పురాతన ఇందుగపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయం

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకే ఉందన్నారు. అయితే రైతులకు గిట్టుబాటయ్యేలా రూ.11,781 ధర కల్పిస్తున్నామని ప్రభుత్వం పేర్కొనడం శోచనీయమన్నారు. మిర్చి రైతులను పూర్తిగా ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. అమరావతి, ఢిల్లీలో రెండు గోడల మధ్య కూర్చుని ధర నిర్ణయించటం బాధాకరమన్నారు. ఈ–క్రాప్ ఆధారంగా పంట విస్తీర్ణాన్ని పరిశీలించి క్వింటాకు రూ.20 వేల చొప్పున మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మిర్చి రైతుల పక్షాన నిలిచి పోరాడుతున్నారని గుర్తు చేశారు. రైతులను ఆదుకోకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలి

పెనుగంచిప్రోలు: ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) జి.ఎస్.వి.ఎస్.రాఘవన్ ఆదేశించారు. పెనుగంచిప్రోలులోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బంది, క్లాప్‌మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలన్నారు. తడి చెత్త, పొడిచెత్త ఇంటి వద్దే వేరు చేయడంపై మహిళలకు అవగాహన కల్పించేందుకు వెలుగు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడుడ నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణతో పాటు ఆదాయం పొందే మార్గాలపై సచివాలయ సిబ్బంది విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట ఎంపీడీఓలు జి.శ్రీను, నితిన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీలు కె.సుబ్బారావు, పద్మావతి, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాఘవన్

వ్యర్థాలు వేర్వేరుగా సేకరించాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు చెత్తను తరలించాలని విజయవాడ రూరల్ మండల ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్ అన్నారు. నున్న గ్రామంలో విజయవాడ రూరల్, జి.కొండూరు, విసన్నపేట మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, గ్రేడ్ 5 కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద సృష్టించడంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది.

నేడు శివకల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి 10.30 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ ట్రస్ట్ సభ్యులు వాసిరెడ్డి బెనర్జీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణానికి ముందు కడప, గుంటూరు కళాకారులతో భరతనాట్య ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీటీపీఎస్ వంద రోజుల వేడుక

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నాలుగో యూనిట్ నిరంతరాయంగా వందరోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి సాధించిన నేపథ్యంలో అధికారులు శతదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఈఈ గోగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగో యూనిట్‌లో ఇప్పటికి 24వ సారి వందరోజుల వేడుకలు జరుపుకోవడం సంస్థకు గర్వకారణం అన్నారు. సంస్థ పురోభివృద్ధిలో అధికారులు, ఉద్యోగులు కార్మికుల కృషి మరువలేనిదని తెలియజేశారు. సంస్థకు విజయాలు అందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్ఈలు తిరుమలప్రసాద్, వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుని కల్యాణోత్సవాలు



పెండ్లి కుమారుని అలంకారంలో దాములూరు సంగమేశ్వర స్వామి వారు



పట్టనంలోని అంకమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు



కాంద్రపాడు మహా పంచ ముఖేశ్వర స్వామి వారు

నందిగామ రూరల్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, స్వామిని పెండ్లి కుమారుని చేయడం, పుణ్యాహవచనం, మండపారాధన, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ నరసింహ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

పట్టణంలో వేంచేసియున్న అంకమ్మతల్లి, దుర్గాదేవి, భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు దండిబొట్ల బాలకృష్ణ శాస్త్రి మంత్రోచ్ఛరణ నడుమ గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కుంకుమార్చన, అమ్మ, స్వామి వారికి పంచామృతాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంద్రపాడులో..

చందర్లపాడు మండలం కాంద్రపాడు గ్రామంలో వేంచేసియున్న మహా పంచముఖేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి కళ్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప సర్పంచ్ కొండా కృష్ణారెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమలు జరుగుతాయన్నారు. కళ్యాణం అనంతరం అన్నదానం చేస్తామని పేర్కొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిది

వత్సవాయి: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ ఎస్.రాంబాబు పేర్కొన్నారు. వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాంబాబు మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా కొన్ని చోట్ల వెలుగులోకి రాకుండా బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బాల్యవివాహాల వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. 18 ఏళ్లు నిండని వారికి వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల అధికారి ఎం.రాజేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాఘవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బీబీ జాన్, భాగ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

పెనుగంచిప్రోలు: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని డీసీపీఓ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు మెన్‌స్ట్రువల్ హైజీన్, బాలల చట్టాలు, బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సమర్థంగా పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, రిసోర్సు పర్సన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు



సదస్సులో మాట్లాడుతున్న డీసీపీఓ రాజేశ్వరరావు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

కంచికచర్ల: ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మొత్తం ఏడు మండలాలు ఉన్నాయి. ఆయా మండల కేంద్రాలలో మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో 8,958 మంది, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 7,367 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు.

డివిజన్‌లో 22 పోలింగ్ స్టేషన్‌లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నందిగామ డివిజన్ పరిధిలో మొత్తం 22 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో 12, జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో 10 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీఓ బాలకృష్ణ తెలిపారు. నందిగామ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదు, చందర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, కంచికచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు, వీరులపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు, పెనుగంచిప్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల బరిలో 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది.

మద్యం దుకాణాలు మూసివేత

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి అధికారులు ప్రతి షాపును సీజ్ చేశారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేస్తామని ఆర్డీఓ బాలకృష్ణ పేర్కొన్నారు.



నందిగామలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బాలకృష్ణ

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

పరిటాల(కంచికచర్ల): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు, వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ ఆదేశించారు. పరిటాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కంచికచర్ల, వీరులపాడు మండలాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, క్లాప్‌మిత్రలు, షెడ్ మిత్రలకు మంగళవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. క్లాప్ మిత్రలకు కేటాయించిన ప్రాంతాల్లో తడిచెత్త, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎంపీడీఓ బి.ఎం.విజయలక్ష్మి, వీరులపాడు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీతారామరాజు, ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, బ్రహ్మం పాల్గొన్నారు.